క్లుప్తంగా

గృహసారథులకు అండగా బీమా సౌకర్యం



మాట్లాడుతున్న బట్టే సుబ్రమణ్యం

వెదురుకుప్పం: గృహసారథులకు అన్నివిధాలా అండగా నిలవాలన్న సంకల్పంతో ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు గృహసారథుల ఇన్‌చార్జ్ బట్టే సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని మాంబేడు, పచ్చికాపల్లం గ్రామ సచివాలయాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహసారథులే పార్టీకి పట్టుకొమ్మలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకుపోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. బీమా ద్వారా గృహసారథులకు భరోసా లభించిందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, గృహసారథుల కన్వీనర్లు రవికుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుమతి, నాయకులు నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏఈ తిమ్మరాజు

వెదురుకుప్పం: మండలంలోని సీఆర్‌కండ్రిగ దళితవాడలో జరుగుతున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు బుధవారం పరిశీలించారు. జీజీఎంపీ నిధులు రూ.6 లక్షలతో 90మీటర్లు డ్రైనేజీ కాలువ పనులు చేపడుతుండడంతో పనుల్లో నాణ్యతపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గతంలో కాలువలు లేక స్థానికులు ఇబ్బందులు పడేవారని చెప్పారు. స్థానికుల సమస్యను గుర్తించి జీజీఎంపీ నిధుల ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. గురువారం నుంచి కాంక్రీట్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ పద్మావతి, స్థానిక నాయకులు రామయ్య, ప్రకాష్ ఉన్నారు.

రాస్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హరి

పుత్తూరు రూరల్: రాష్ట్రీయ సేవాసమితి సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి అన్నారు. బుధవారం ఆరేటమ్మ ఆలయ ఆవరణలో రాస్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి రాస్ సంస్థ చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. మహిళలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు, వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయమన్నారు. రాస్ సేవలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఇతరులకు తమవంతు సహకారం అందించాలని సూచించారు. వరలక్ష్మీ వ్రతాన్ని అందరూ కలిసి చేసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. అనంతరం మహిళలకు కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరేటమ్మ ఆలయ చైర్మన్ మనోహర్‌రెడ్డి, రాస్ అధికారులు వెంకటరత్నం, రవి, ప్రకాష్, మీనా, భారతి, వరలక్ష్మి, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : పిల్లల్లో రక్తహీనత తొలగించేందుకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఎంతగానో దోహదపడతాయని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతలకు సూపర్‌వైజర్ సుశీల, మురళి సమక్షంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత తొలగాలంటే తప్పకుండా ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు వేయడం ద్వారా పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. అనంతరం గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

చీడపీడల నివారణపై అవగాహన

నింద్ర: వంగ సాగులో సస్యరక్షణ తప్పనిసరిగా చేపట్టాలని ఏఓ తులసిరాం అన్నారు. బుధవారం అగరం గ్రామంలో వంగ పంటను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వంగ సాగు చేసిన రైతులు పదిరోజులకు ఒకసారి సస్యరక్షణ చేపట్టాలన్నారు. వర్షాలు పడుతుండడం వల్ల పంటకు చీడపీడలు పట్టే అవకాశం ఉందని, తోటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

ప్రజలు మెచ్చిన ప్రభుత్వం మాది

- అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- ప్రతి గడపలో ప్రజలు ఆత్మీయంగా స్వాగతిస్తున్నారు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మహిళా వలంటీర్లను సన్మానిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొటార్వేడు సచివాలయ పరిధిలోని కేఎం పురం ఏఏ డబ్ల్యూ, కేఎంపురం, గొల్లకండ్రిగ, గొల్లకండ్రిగ హెచ్‌డబ్ల్యూ, కొటార్వేడు, కనికాపురం, వత్తులూరు, కొటార్వేడు దళితవాడ గ్రామాల్లో సర్పంచ్‌లు భారతి, శీలారాణి, ఎంపీటీసీ విమల ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలను వింటూ అప్పటికప్పుడే పరిష్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జగనన్న నాయకత్వమంటే అది పూర్తిగా జననాయకత్వమేనని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు భరోసా కల్పించామని, ఇప్పటికే 99 శాతం హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని అసాధ్యమైన పథకాలను నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి దేశ చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయండి

గ్రామాల్లో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా దుస్థితికి చేరుకున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన దుస్థితికి చేరిన ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే కేఎం పురం దళితవాడకు చెందిన మహిళలు ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వెంటనే విద్యుత్ తీగలను వెంటనే తొలగించి, విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం కేఎంపురం గ్రామానికి చెందిన వినోద్‌కుమార్, ఆదెమ్మ, కోమల, పుష్ప తదితరులు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో నలుగురు ప్రభుత్వ పథకాలు, పింఛన్లను అందుకుంటున్నామని ఆనందంగా చెప్పారు. తమ ఇంటికి ఇప్పటి వరకు రూ.7.70 లక్షలు లబ్ధి చేకూరిందని తెలిపారు. జగనన్నే ముఖ్యమంత్రిగా ఎప్పుడూ ఉండాలని, ఆయన ఉంటే తమలాంటి ఎంతోమంది ఆనందంగా జీవిస్తారని ఆకాంక్షించారు. అలాగే కొటార్వేడు గుండ్ల దళితవాడకు చెందిన మహిళలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణాలు చేసి తమకు అండగా నిలుస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటామని తెలిపారు. కనికాపురం, వత్తులూరు, కొటార్వేడు గ్రామాల్లో మహిళలు ఇంటింటా కర్పూర హారతులు పట్టి, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా గొల్లకండ్రిగ, గొల్లకండ్రిగ దళితవాడలో మినరల్ వాటర్ ప్లాంట్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, వెంకటేష్, ఆనంద్, విజయకుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవ్, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటరత్నం, బాబురెడ్డి, మాజీ సర్పంచ్ విజయులురెడ్డి, ఓం ప్రకాష్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, జేమ్స్, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్, ఎంఈఓ విజయకుమార్, ఏపీఓ జాహ్నవి, ఏపీఎం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులను అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

నగరి అభివృద్ధికి తుడా నిధులు

- రూ.6 కోట్లకు సంబంధించిన పనులకు వీసీ సానుకూల స్పందన



తుడా వైస్ చైర్మన్‌కు అభ్యర్థన పత్రం అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి : నియోజకవర్గ అభివృద్ధి పనుల నిమిత్తం తుడా వీసీ ఎం.హరికృష్ణను తుడా కార్యాలయంలో మంత్రి ఆర్‌కే రోజా తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో సంప్రదించిన మేరకు బుధవారం ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి కలిశారు. నియోజకవర్గంలో తుడా ద్వారా చేపట్టవలసిన అభివృద్ధి పనుల నిమిత్తం మంత్రి రూ.6 కోట్ల అంచనాతో సిద్ధం చేసిన నివేదికను ఆయనకు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తుడా వీసీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో, చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో చర్చించి పనులు చేపడతామని చెప్పినట్లు మంత్రి సోదరుడు తెలిపారు.

గజవాహనంపై ద్రౌపదీదేవి విహారం



గెరిగె ఊరేగింపు



గజ వాహనంపై విహరిస్తున్న ద్రౌపదీ సమేత అర్జునస్వామి

పుత్తూరు రూరల్: పట్టణంలో ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనంపై ద్రౌపదీదేవి విహరించారు. ప్రతి ఇంటి వద్ద భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హేమాచలం బాబు ఆధ్వర్యంలో మంచినీళ్ల గుంట వద్ద నుంచి గెరిగె ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా గెరిగె జలాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఈశ్వరాపురం దళిత సంఘం ఆధ్వర్యంలో గాండీవ రాజసూయయాగం ఘట్టం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ద్రౌపదీ సమేత అర్జునుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజ వాహనంపై కొలువు దీర్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గజవాహనం ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, ఆలయ నిర్వాహకులు ఏలుమలైమొదలి, పళనిమొదలి, గోపిమొదలి, పెరుమాళ్‌మొదలి, కుప్పుస్వామిమొదలి పర్యవేక్షించారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఉన్నత లక్ష్య సాధనకు విద్య అద్భుతమైన సాధనమని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో తొలి ఏడాది ప్రవేశాలు పూర్తి అయిన నేపథ్యంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. పాఠాలను ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. సానుకూల దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. చెడు అలవాట్లకు దూరంగా, కుటుంబ గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర జూనియర్స్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.రవి, జిల్లా అధ్యక్షుడు రాజనాల, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు గౌరిశంకర్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘుపతి, డిగ్రీ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు టి.నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు భాషా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు అధ్యాపకులు చంద్రబాబు తెలుగు భాషా ప్రావీణ్యం, ప్రాముఖ్యత, విశిష్టతను గురించి విపులంగా వివరించారు. ప్రతి ఒక్కరూ అమ్మలాంటి తెలుగు భాషపై మక్కువ చూపాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీప్రసన్న, వెంకటేశు, భరణినాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరం సీఐగా సత్యబాబు



కార్వేటినగరం: కార్వేటినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సత్యబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు వీఆర్ నుంచి కార్వేటినగరం సీఐగా బదిలీపై వచ్చారు. ఇక్కడ గతంలో సీఐగా ఉన్న చంద్రశేఖర్ తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ సత్యబాబు మాట్లాడుతూ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఇందుకు సర్కిల్ పరిధిలో ఎస్‌ఐలు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, రాజకీయ నాయకులు పలువురు నూతన సీఐ సత్యబాబుకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి

నగరి : నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంఈఓలు శ్రీదేవి, బి.నమశ్శివాయంతో కలిసి మండలంలోని నాడు-నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పాఠశాలలో పనులు పూర్తి కావడానికి సూచనలు, సలహాలను అందించారు. మండలంలో వారానికి ఒక పాఠశాల మొత్తం కాంపొండెంట్లు పూర్తయ్యే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. రోజువారి ఖర్చులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అలాగే రివాల్వింగ్ ఫండ్‌లో ఒకటి బై మూడో వంతు రుసుము బిల్లులు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కోరారు. ఇందులో ఏదైనా సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తేవాలని సూచించారు. సచివాలయం వారీగా వార్డు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సహాయం తీసుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో 6, 9 తరగతుల్లో చేరిన వారి వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

తల్లీబిడ్డ వాహన సేవలు వినియోగించుకోండి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి



అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

నగరి : తల్లీబిడ్డ వాహనసేవలు వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి అన్నారు. బుధవారం పుదుపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను గతేడాది ఏప్రిల్ 1వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా 500 కొత్త వాహనాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాకు 16 వాహనాలు సమకూర్చామని తెలిపారు. ఈ వాహనాలు గతేడాది నుంచి ప్రస్తుత ఏడాది జూలై 2023 వరకు 10,238 మంది బాలింతలను సురక్షితంగా వారి ఇంటికి తరలించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా అత్యవసర చికిత్స అవసరమైన గర్భిణులు, సివియర్ అనిమిక్‌గా ఉన్న గర్భిణులను ఇంటి వద్ద నుంచి ఆస్పత్రికి తీసుకువచ్చి, రక్తమార్పిడి అయిన తర్వాత ఇంటికి చేర్చడం జరుగుతుందన్నారు. సురక్షితమైన, ఆరోగ్యవంతమైన ప్రసవం జరగడానికి ఇంటి వద్ద నుంచి ఉచితంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ రవాణా సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు. అందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సమాచారాన్ని విస్తృతంగా క్షేత్రస్థాయిలో ఉన్న ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ఎంఎల్‌హెచ్‌పీలు సమాచారాన్ని అందరికీ తెలియపరచి ఈ సేవలు వినియోగించుకునేలా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డెమో జయరాముడు, ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించడమే ధ్యేయం



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

వెదురుకుప్పం: గ్రామాల్లో భక్తిభావాన్ని పెంపొందించడమే ప్రధాన ధ్యేయమని దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని సీఆర్‌కండ్రిగ దళితవాడలో జరుగుతున్న శ్రీ వినాయక స్వామి ఆలయ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడల్లో ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలోనే వినాయక స్వామి ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయ నిర్మాణం చేపడుతున్నారని చెప్పారు. ఆయన వెంట అసిస్టెంట్ ఇంజినీరు శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ సాయికుమార్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం రామయ్య, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్ ఉన్నారు.

రేషన్ డీలర్ మృతి



గోపాలన్(ఫైల్)

పాలసముద్రం : చాలా రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్ డి.గోపాలన్ బుధవారం మృతి చెందారు. ఆయన మండలంలోని సీఎం కండ్రిగ 6 చౌకదుకాణం డీలర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతదేహానికి పంచాయతీ సర్పంచ్ గాలి మహేష్ బాబు, రెవెన్యూ సిబ్బంది నివాళులు అర్పించారు.

భూతవాహనంపై వీరభద్రుడు



పురవీధుల్లో విహరిస్తున్న స్వామివారు

నారాయణవనం: మండలకేంద్రంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు భూతవాహనంపై అధిష్టించి పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయంలో అర్చకులు నిత్య కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు భద్రకాళీ, వీరభద్రులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవర్లను భూత వాహనంపై అధిష్టింపజేశారు. సుగంధ పుష్పాలు, పట్టు వస్త్రాలతో అలంకరణలో వీరభద్రుడు కోటవీధి, సెంగుందర్ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. గురువారం సాయంత్రం స్వామివారు శేష వాహనంపై ఊరేగనున్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన తోటలను పరిశీలిస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల రసాయనాల వాడకం ఉండదని, అలాగే జీవామృతంతో తయారు చేసిన కషాయాలతో పంటలకు సోకే చీడపీడలను నివారించవచ్చని చిత్తూరు ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. బుధవారం ఆయన రైతులకు శ్రీకావేరిరాజుపురంలో జీవామృతంతో కషాయం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో పంటలు సాగు చేయాలని సూచించారు. ఒక ఎకరా సాగు చేసిన పంటలో చీడపీడల నివారణకు కషాయం తయారీకి ద్రవజీవామృతం, దేశీయ ఆవుపేడ 10కేజీలు, ఆవు మూత్రం 10 లీటర్లు, నల్లబెల్లం 2 కేజీలు, పప్పు దినుసుల పిండి 2 కేజీలు, పుట్టమట్టి 1 కేజీ, వీటన్నిటిని 20 లీటర్ల నీటిలో కలియబెట్టి వారం రోజులు పులియపెట్టాలన్నారు. తరువాత పంటలకు సోకే చీడపీడల నివారణకు వాడాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో కూరగాయల సాగు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ వితరణ



పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరిస్తున్న దాతలు వరదయ్య, కౌసల్య



విద్యార్థులతో బాలగోవిందన్

నగరి : విదేశాల్లో ఉంటూ స్వదేశానికి వచ్చిన ఒక కుటుంబం ఇక్కడ ప్రభుత్వ పాఠశాల పనితీరు, అడిగే ప్రశ్నలకు విద్యార్థులు చక్కగా సమాధానాలు ఇవ్వడంపై సంతృప్తి చెంది పాఠశాలకు స్మార్ట్ టీవీని బహూకరించిన సంఘటన మండలంలోని నంబాకం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన శుభగోవిందన్ కుటుంబం అమెరికాలో నివాసం ఉంటోంది. ఇటీవల గ్రామానికి విచ్చేసిన వారు మండల పరిషత్ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ చదివే పిల్లలను ప్రశ్నలు అడగ్గా వారు చక్కగా సమాధానం చెప్పడంతో ముగ్ధులై పాఠశాలకు స్మార్ట్ టీవీని అందించారు. ఈ సందర్భంగా బాగా చదివి గ్రామానికి మంచిపేరు తేవాలంటూ సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు బాలగోవిందన్‌కు ఆయన కుటుంబసభ్యులు వరదయ్య, కౌశల్యకు ధన్యవాదాలు తెలిపారు.

గగనతలంపై భారత కీర్తిపతాకం





నగరి: జాతీయ పతాకాన్ని చూపుతూ, టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- చంద్రయాన్-3 విజయవంతంపై వేడుకలు
- చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలిదేశం భారత్
- అంబరాన్నంటిన సంబరాలు

నగరి : చంద్రయాన్-3 విజయవంతం కావడంపై స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల వారు సంబరాలు చేసుకున్నారు. టవర్‌క్లాక్ సెంటర్‌లో టపాకాయలు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. జాతీయ పతాకాన్ని చూపిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతంగా విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై కాలు మోపిందన్నారు. చంద్రునిపై భారత జెండా ఎగురుతోందని తెలిపారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ మరో మైలురాయి దాటిందని, చంద్రునిపై కాలుమోపిన నాలుగో దేశంగా, చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఇది ప్రతి భారత పౌరుడు గర్వించదగ్గ అంశమన్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడానికి పాటుపడిన ప్రతి శాస్త్రవేత్తకు గౌరవ వందనం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.